సాక్షి
ఖమ్మం
మంగళవారం । 18 । జూలై । 2023



భావి శాస్త్రవేత్తలారా రండి!
ఇన్‌స్పైర్ మనాక్ ద్వారా విద్యార్థులు సత్తా చాటేందుకు ఈనెల 31వ వరకు నూతన ఆవిష్కరణలతో దరఖాస్తు చేసుకోవచ్చు. 8లో



ఎన్నికల బరిలో ప్రజాపంథా
వచ్చే ఎన్నికల్లో పలు స్థానాల నుంచి తమ పార్టీ అభ్యర్థులు బరిలో ఉంటారని ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తెలిపారు. 10లో

గరిష్టం / కనిష్టం
28° / 25°
వాతావరణం
జిల్లాలో మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు ప్రాంతాల్లో చిరుజల్లులు మొదలు ఓ మోస్తరు వర్షం కురుస్తుంది.

న్యూస్‌రీల్

ఈనెల 24 వరకు 30 పోలీస్ యాక్ట్

ఖమ్మంక్రైం: శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఈనెల 24వ తేదీ వరకు ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని సీపీ విష్ణు ఎస్.వారియర్ తెలిపారు. ఈమేరకు అనుమతి లేకుండా సభలు, ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించొద్దని సూచించారు. ఈ విషయంలో ప్రజలు, రాజకీయ పార్టీలు, సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని కోరారు. కమిషనరేట్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నట్లు సీపీ ఓ ప్రకటనలో తెలిపారు.

క్షేత్రస్థాయిలో ఓటర్ల సర్వే పూర్తి

ఆరుకు పైగా ఓట్లు ఉన్న ఇళ్లలో పరిశీలన

ఖమ్మం సహకారనగర్: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ఓటర్ల జాబితా పరిశీలన చురుగ్గా సాగుతోంది. ఈమేరకు క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టిన అధికార యంత్రాంగం ఆరు ఓట్లకు పైగా ఉన్న ఇళ్లను గుర్తించారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధి 21 మండలాలు, 1,430 పోలింగ్ కేంద్రాల పరిధిలో సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా 25,458 ఇళ్లల్లో ఆరుగురికి పైగా ఓట్లు ఉన్నట్లు తేలింది. దీంతో మొత్తంగా 2,33,483 ఓటర్లకు సంబంధించి విచారణ చేపట్టిన అధికారులు 2,21,055మంది వివరాలు సరిగ్గానే ఉన్నాయని నిర్ధారించారు. ఇక మిగతా 12,428మంది ఓటర్ల విషయంలో సవరణ చేయాల్సి ఉండగా ఫారం–8 అందజేశారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూం

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కంట్రోల్ రూమ్‌లో సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటారని ఖమ్మం ఎన్పీడీసీఎల్ సర్కిల్ ఆపరేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఏ సురేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సమస్యల పరిష్కారం 94408 11525 నంబర్‌కు ఫోన్ చేయొచ్చని పేర్కొన్నారు. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను మార్చడమే కాక ఇతర సామగ్రి అందుబాటులో ఉందని తెలిపారు. ఈమేరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడిలో జాప్యం, బిల్లుల్లో హెచ్చుతగ్గులు తదితర సమస్యలు ఉంటే కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేయాలని ఎస్ఈ సూచించారు.

రిజర్వేషన్ల కోసం 21న ఢిల్లీలో ధర్నా



మాట్లాడుతున్న సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్

ఖమ్మం మామిళ్లగూడెం: బీసీలకు చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించడమే కాక ఇతర సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో ఈనెల 21న ఢిల్లీలో నిరసన చేపడుతున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ తెలిపారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోదేపల్లి కృష్ణమాచారితో సోమవారం ఆయన ఖమ్మంలో మాట్లాడారు. బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటుచేసి కేంద్ర స్థాయిలో సబ్‌ప్లాన్ అమలు చేయాలని, ఉద్యోగులకు పదోన్నతులు రిజర్వేషన్లు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈమేరకు ఢిల్లీలో నిర్వహించనున్న నిరసనకు బీసీలు తరలిరావాలని కోరారు. ఈసమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లింగబోయిన పుల్లారావు, జిల్లా కార్యదర్శి హన్మంతుతో పాటు నాగేశ్వరావు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గంజాయ్.. ఫుల్!



ఈ ఏడాది ఇప్పటివరకు పట్టుపడిన గంజాయి, కేసుల వివరాలు



పట్టుపడిన గంజాయి 1,247.95 కేజీలు
గంజాయి విలువ రూ.1,87,19,250
నమోదైన కేసులు 60
అరెస్టయిన వ్యక్తులు 95 మంది

జిల్లాలో పలు ప్రాంతాల మీదుగా రవాణా
- తనిఖీలు చేస్తున్నా నిఘా కళ్లు గప్పి జోరుగా దందా
- ఈ ఏడాది ఇప్పటికి 60 కేసులు నమోదు
- మత్తుకు బానిసై ఘర్షణకు దిగుతున్న యువత

సాక్షిప్రతినిధి, ఖమ్మం: చెక్‌పోస్టులు పెట్టినా.. ఎక్సైజ్, రైల్వే, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు చేస్తున్నా గంజాయి రవాణా ఆగడం లేదు. జిల్లావ్యాప్తంగా తనిఖీల్లో నిత్యం ఎక్కడో ఒక చోట గంజాయి పట్టుబడుతోంది. కొన్నిచోట్ల నుంచి నిఘా కళ్లు కప్పి గంజాయి తరలించి అమ్మకాలు చేపడుతుండగా యువత మత్తులో చిత్తవుతోంది. పల్లెలు, పట్టణాలు తేడా లేకుండా ఎక్కడ పడితే అక్కడ గంజాయి అమ్మకందారులు, కొనుగోలుదారులు పెరుగుతున్నట్లు ఇటీవల జరుగుతున్న ఘర్షణలతో వెల్లడవుతోంది. యువతకు గంజాయి మత్తు ఎంజాయ్'గా మారగా.. ఘర్షణలకు పాల్పడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారు.

కొత్త దారులు వెతుక్కుని మరీ..

జిల్లా మీదుగా గంజాయి రవాణా ఇటీవల మరింతగా పెరిగింది. గతంలో కూడా గంజాయి స్మగ్లింగ్ జరిగినా, ఇప్పుడు కొత్త పుంతలు తొక్కుతోంది. పోలీస్, ఎక్సైజ్, జీఆర్పీ ఆధ్వర్యంలో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి విస్తృత తనిఖీలు చేపడుతున్నా వీటన్నింటినీ రవాణాదారులు దాటుకుని ముందుకు సాగుతున్నారు. రైల్వేస్టేషన్లలో తనిఖీలు పెరగడంతో ఆర్టీసీ బస్సులు, ద్విచక్ర వాహనాలను ఎంచుకుంటున్నారు. ఒడిశా నుంచి భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల మీదుగా ముంబై, ఢిల్లీ తదితర ప్రాంతాలకు గంజాయి తరలిస్తుండగా.. నిఘా వర్గాలకు చిక్కకుండా సరుకు దాటిస్తున్నారు.

నగరంలో ఎక్కడపడితే అక్కడే

ఖమ్మం నగరంలో గంజాయి ముఠాలు బరితెగిస్తున్నాయి. పలు ప్రాంతాల్లో కొందరు ముఠాలుగా ఏర్పడి గంజాయి విచ్చలవిడిగా అమ్ముతున్నారనే ప్రచారం జరుగుతోంది. దీంతో యువకులు బానిసలై గొడవలకు దిగుతూ ప్రశ్నించిన వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఒక్క ఖమ్మంలోనే ఈ ఏడు నెలల కాలంలో గంజాయికి సంబంధించి 38 కేసులు నమోదు కాగా, 78 మందిని అరెస్ట్ చేశారు. ఇది కేవలం పట్టుపడింది కాగా.. పట్టుపడకుండా గంజాయి ఎంత మేర అమ్ముతున్నారు, ఎందరు బానిసలవుతున్నారో అర్థం చేసుకోవచ్చు.

తనిఖీలు చేపట్టినా..

గంజాయి స్మగ్లింగ్ భారీగా జరుగుతుండడంతో ఎక్సైజ్, పోలీస్, జీఆర్పీ ఆధ్వర్యంలో తనిఖీలు ముమ్మరం చేశారు. ప్రధానంగా భద్రాద్రి కొత్తగూడెం నుంచి ఖమ్మం రహదారుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఇటీవల అక్రమార్కులు రైలు ద్వారా గంజాయి తరలింపును తగ్గించి బస్సులను ఎంచుకున్నట్లు తెలుస్తోంది. అలాగే పోలీసులకు చిక్కకుండా తరలించేందుకు ప్రైవేట్ వాహనాల ద్వారా వెళ్తున్నారు. ఈక్రమంలో పలుమార్లు వారి ప్రయాణం సాఫీగా సాగుతున్నా, కొన్నిసార్లు పోలీసులకు చిక్కుతున్నారు. కాగా, స్మగ్లర్లు రూట్ మార్చడంతో పోలీసులు కూడా బస్టాండ్లు, కూడళ్ల వద్ద నిఘా పెంచి తనిఖీలు విస్తృతం చేయగా కేజీల కొద్దీ గంజాయి పట్టుబడుతోంది. అయితే, ఇదే స్థాయిలో హద్దులు దాటుతోందన్న ప్రచారం జరుగుతోంది.

మత్తులో చిత్తు

గంజాయి మత్తులో యువత చిత్తవుతోంది. చిన్న వయసులోనే యువత గంజాయికి బానిసలు కావడంతో గొడవలు సర్వసాధారణమయ్యాయి. మత్తుకు అలవాటు పడిన వారు విచక్షణ జ్ఞానం కోల్పోయి సైకోలుగా మారుతున్న ఘటనలు ఖమ్మం నగరంలో ఇటీవల వెలుగు చూశాయి. ఏం చేస్తున్నామో తెలియని పరిస్థితుల్లో గొడవలకు, ఘర్షణలకు చివరకు హత్యలకు కూడా దిగుతున్నారు. ఇలా గంజాయి మత్తు అనేక కుటుంబాల్లో అలజడి సృష్టిస్తోంది.

కాంగ్రెస్‌కు మద్దతిస్తే అంతే...



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్, పక్కన డీసీసీబీ, జెడ్పీ చైర్మన్లు నాగభూషణం, కమల్‌రాజ్, రైతుబంధు సమన్వయ సమితి జిల్లా కన్వీనర్ వెంకటేశ్వరరావు, మేయర్ నీరజ

- ఉచిత విద్యుత్‌ను మరిచిపోవాల్సిందే
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

చింతకాని: కాంగ్రెస్ పార్టీకి మద్దతిస్తే ఉచిత విద్యుత్ పథకాన్ని రద్దు చేస్తారని, తద్వారా రైతులు కరెంట్‌ను మరిచిపోవాల్సి వస్తుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం నిర్వహించిన రైతు సమావేశంలో మంత్రి పువ్వాడ ప్రసంగించారు. రైతు సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుంటే వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అనుచితమని పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. 2017లో అసెంబ్లీ సాక్షిగా వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని ప్రకటించినట్లుగానే సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో 7,800 మెగావాట్లుగా ఉన్న ఉత్పత్తి సామర్థ్యాన్ని నేడు 18 వేల మెగావాట్లకు చేర్చారని, సబ్‌స్టేషన్ల నిర్మాణం కోసం రూ.30 వేల కోట్లు వెచ్చించారని వెల్లడించారు. వ్యవసాయాన్ని పండుగ చేస్తుండడంతో రైతులు బాగుపడుతుండగా ఓర్వలేని కాంగ్రెస్ నేతలు తప్పుడు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు.

చంద్రబాబు ఏజెంట్

సాగుకు 24 గంటల విద్యుత్ ఇవ్వడంతో పాటు ప్రాజెక్టుల నిర్మాణంతో రాష్ట్రంలో వ్యవసాయం పండుగలా సాగుతోందని మంత్రి పువ్వాడ వెల్లడించారు. వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు మాదిరిగానే రేవంత్‌రెడ్డి కూడా మాట్లాడుతూ ఆయన ఏజెంట్‌లా పనిచేస్తున్నారని మండిపడ్డారు. ఇక ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ లీడర్ కాదని.. చూసి చదివే రీడర్ అని ఎద్దేవా చేశారు. మూడు గంటల విద్యుత్ ఇచ్చే కాంగ్రెస్ పార్టీ కావాలో, మూడు పంటల బీఆర్ఎస్ ప్రభుత్వం కావాలో రైతులు ఆలోచన చేయాలని మంత్రి కోరారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసి తీరుతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, మధిర మార్కెట్ చైర్మన్ బంధం శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పర్చగాని తిరుపతి కిషోర్, ఎంపీపీ కోపూరి పూర్ణయ్యతో పాటు గురిజాల హన్మంతరావు, మంకెన రమేష్, పానుగోటి రత్నాకర్, పెంట్యాల పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ముత్తంగి అలంకరణలో రామయ్య

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి మూలమూర్తులు ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి సోమవారం స్వామివారిని ఈ రూపంలో అలంకరించడం ప్రత్యేకత. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశా రు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్ర ధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

అన్నదాతకు అండగా నిలవడమే లక్ష్యం



ట్రాక్టర్ల ర్యాలీలో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, నాయకులు, రైతులు (ఇన్‌సెట్) ఎడ్లబండితో ఎమ్మెల్యే

సత్తుపల్లి ఎమ్మెల్యే వెంకటవీరయ్య

వేంసూరు: రైతన్నలను కష్టాల పాలు చేసేందుకు యత్నిస్తున్న కాంగ్రెస్ కుట్రలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టి అన్నదాతలకు అండగా నిలవడమే బీఆర్ఎస్ పార్టీ లక్ష్యమని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య వెల్లడించారు. ఉచిత విద్యుత్ విషయమై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ వేంసూరు మండలంలోని అమ్మపాలెం నుంచి వెంకటాపురం వరకు సోమవారం భారీ ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే సండ్ర మాట్లాడుతూ మూడు పంటల బీఆర్ఎస్ ప్రభుత్వం కావాలా.. మూడు గంటల విద్యుత్ ఇచ్చే కాంగ్రెస్ ప్రభుత్వం కావాలో రైతులు ఆలోచన చేయాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం ఏటా ఉచిత విద్యుత్ కోసం రూ.10,500 కోట్లు వెచ్చిస్తోందని తెలిపారు. రాష్ట్రంలో 30లక్షల కనెక్షన్ల ద్వారా రైతులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణలోనే ఉందని తెలిపారు. అలాగే, రైతుబంధు, రైతుబీమా పథకాలతో రైతులకు అండగా నిలుస్తుంటే ఓర్వలేని కాంగ్రెస్ నేతలు తప్పుడు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ మారోజు సుమలత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, నాయకులు పాలా వెంకటరెడ్డి, దొడ్డా వెంకటకృష్ణారెడ్డి, నూనె హరి బాబు, పుచ్చకాయల శంకర్‌రెడ్డి, గొర్ల ప్రభాకర్‌రెడ్డి, మందపాటి మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యం కోసమే పాదయాత్ర

- దోపిడీదారుల నుంచి తెలంగాణను కాపాడుకుంటాం
- సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క

మధిర: దోపిడీదారుల నుంచి తెలంగాణ రాష్ట్రాన్ని కాపాడడంతో పాటు ఇందిరమ్మ రాజ్యాన్ని ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పాదయాత్ర చేశానని సీఎల్పీ నేత, మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. పాదయాత్ర ముగిశాక తొలిసారిగా ఆయన సోమవారం మధిర నియోజకవర్గ పర్యటనకు వచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు దెందుకూరు వద్ద ఘన స్వాగతం పలకగా, అక్కడి నుంచి మోటార్ సైకిళ్లపై ర్యాలీగా భట్టి, నాయకులు తరలివచ్చారు. అనంతరం మధిరలోని కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన సభలో భట్టి మాట్లాడుతూ మధిర నియోజకవర్గం, ఖమ్మం జిల్లా ప్రజలు తలదించుకునే పని ఎప్పటికీ చేయనని తెలిపారు. పాదయాత్రలో ప్రజలు పడుతున్న బాధలను చూసి చలించిపోయానని చెప్పారు. ఓ దశలో ఎండ తట్టుకోలేక పాదయాత్రను నిలిపివేద్దామని అనుకున్నా... పేదల కష్టాలు తెలుసుకునేందుకే ముందుకు సాగానని వెల్లడించారు. నిధులు, నీళ్లు, నియామకాల కోసం కాంగ్రెస్ తెలంగాణను ఏర్పాటుచేస్తే.. నాడు డిప్యూటీ స్పీకర్ హోదాలో ఉన్న తాను బిల్లు పాస్ చేశానని గుర్తుచేశారు. అయితే, తెలంగాణ ప్రజల ఆకాంక్షను బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలు నెరవేర్చకుండా దోచుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని మండిపడ్డారు. కాగా, వచ్చే ఎన్నికల్లో పార్టీ శ్రేణులు, ప్రజల సహకారంతో ఉమ్మడి జిల్లాలో పదికి పది స్థానాలు గెలుస్తామని భట్టి ధీమా వ్యక్తం చేశారు. అనంతరం భట్టిని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు.




మధిర : మాట్లాడుతున్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, పక్కన డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల తదితరులు

రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే

ఎర్రుపాలెం: రాబోయే ఎన్నికల్లో గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసేది కాంగ్రెస్సేనని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు. సోమవారం నియోజకవర్గానికి వచ్చిన ఆయనకు తెలంగాణ – ఏపీ సరిహద్దు వద్ద నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలకగా, ఆ ఆతర్వాత మోటార్ సైకిళ్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎర్రుపాలెం మండల పరిషత్ కార్యాలయం వద్ద రిలే దీక్షలు చేస్తున్న పంచాయతీ కార్మికులను కలిసి భట్టి వారికి అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. ఆతర్వాత అంబేద్కర్ విగ్రహం, బనిగండ్లపాడులో మాజీ మంత్రి శీలం సిద్దారెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. ఆతర్వాత రాజులదేవరపాడులో కార్యకర్తలను ఉద్దేశించి భట్టి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వివరిస్తూనే, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలుచేయనున్న పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ సమావేశాల్లో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డితో పాటు పీసీసీ సభ్యులు, నాయకులు,ప్రజాపతినిధులు శీలం ప్రతాపరెడ్డి, రాయల నాగేశ్వరరావు, మోదుగు సుధీర్, బండారు నర్సింహారావు, ఐలూరి వెంకటేశ్వరరెడ్డి, బాబు, వేమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, రాందాస్ నాయక్, బాలాజీనాయక్, వడ్డే నారాయణ, బండారు నర్సింహారావు, అనుమోలు కృష్ణారావు, శీలం శ్రీనివాసరెడ్డి, మల్లెల లక్ష్మణరావు, దేవరకొండ రాజీవ్‌గాంధీ, లక్కిరెడ్డి నర్సిరెడ్డి, శేగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గొంతు దిగని బోడ కాకర!

- మార్కెట్‌లో కిలో ధర రూ.400
- టమాటాకు నాలుగింతలు.. చికెన్‌కు రెండింతల ధర



ఖమ్మం సమీకృత మార్కెట్‌లో పావు కేజీ రూ.100గా చూపిస్తున్న బోర్డ్

మధిర: ఏటా కొద్ది నెలల పాటే లభించే బోడ కాకరకు మంచి డిమాండ్ ఉంటుంది. అటు రుచితో పాటు ఇటు పోషకాలు కలిగిన బోడ కాకరను అటవీ ప్రాంతాల నుంచి గిరిజనులు తీసుకొచ్చి అమ్ముతుంటారు. అయితే, ఈసారి మార్కెట్‌తో పాటు బయట కూడా కేజీ రూ.400 చొప్పున విక్రయిస్తుండడంతో ధర తెలుసుకుంటున్న ప్రజలు కళ్లు తేలేస్తున్నారు. ఇప్పటికే కిలో టమాటా ధర రూ.100 దాటగా.. కిలో చికెన్ రూ.240నుంచి రూ.260 వరకు పలుకుతోంది. వీటిని దాటేసి బోడ కాకర రూ.400 పలుకుతుండడం, పావు కిలో తీసుకుందామన్నా రూ.వంద ఉండడంతో ఎవరూ ఆ దిశగా సాహసం చేయడం లేదు. కాగా, ఈ ఏడాది వర్షాలు సక్రమంగా లేకపోవడంతో బోడ కాకర తీగలు పెరగలేదని.. దీని ఫలితంగా ధర అమాంతం పెరిగిందని తెలుస్తోంది.

ఎన్నో ఉపయోగాలు

కేలరీలు తక్కువగా ఉండడంతో పాటు పీచు పదార్థాలు, యాంటీ ఆక్సిడెంట్లు అధిక మోతాదులో లభించే బోడ కాకర తింటే జీర్ణ వ్యవస్థను మెరుగుపరుస్తుందని చెబుతారు. అలాగే, 100 గ్రాముల బోడ కాకరలో కేవలం 17 క్యాలరీలే లభిస్తాయి. ఇవి తినడం ద్వారా డయాబెటిస్‌ను నియంత్రణలో ఉంచుతుందని, చక్కెర స్థాయిని క్రమబద్ధీకరిస్తుందని, వర్షాకాలంలో విరివిగా లభించే వీటిని తరచుగా తీసుకుంటే దగ్గు, జలుబు, ఇతర అలర్జీలు దూరమవుతాయని నిపుణులు చెబుతారు. ఆరోగ్యంతో పాటు రుచిగా ఉండే బోడ కాకరను చాలా మంది ఇష్టపడుతుండగా ధర అమాంతం ఎగబాకడంతో చూసి సంతోషించడం తప్ప కొనేందుకు ఇష్టపడడం లేదు.

వరల్డ్ సెయిలింగ్ టోర్నీకి అఖిల్



విమానాశ్రయంలో అఖిల్, తదితరులు

ఖమ్మం స్పోర్ట్స్: ప్రపంచ స్థాయి సెయిలింగ్ టోర్నీకి వైరా మండలం కోస్తాల గ్రామానికి చెందిన పిల్లి అఖిల్ ఎంపికయ్యారు. స్పెయిన్ దేశంలో ఈనెల 21వ తేదీ నుంచి 29వ తేదీ వరకు వరకు జరిగే టోర్నీలో పాల్గొనేందుకు గాను సోమవారం రాత్రి ఆయన బయలుదేరారు. కాగా, టోర్నీలో భారత జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్న అఖిల్ 420 మిక్స్‌డ్ ఈవెంట్‌లో పాల్గొంటారు.

క్లుప్తంగా

నేడు మంత్రి పువ్వాడ పర్యటన

ఖమ్మం మయూరిసెంటర్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మంగళవారం ఖమ్మం కార్పొరేషన్‌తో పాటు రఘునాథపాలెం మండలాల్లో పర్యటించనున్నారు. ఖమ్మంలోని 7, 12, 16, 23, 44వ డివిజన్లలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు పూర్తయిన పనులను ప్రారంభిస్తారు. అలాగే, ఉదయం 11గంటలకు రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెంలో పీఏసీఎస్ గోదాంలను ప్రారంభించనున్న మంత్రి, అక్కడి రైతు వేదికలో జరిగే రైతుల సమావేశంలో పాల్గొని మాట్లాడతారు. అతర్వాత సాయంత్రం ఐదు గంటలకు ఖమ్మంలోని వీడీవోస్ కాలనీలో డ్రైవింగ్ లైసెన్స్ పరీక్షకు హాజరైన వారికి లెర్నింగ్ లైసెన్స్ పత్రాలు అందజేస్తారు.

రుక్మిణికి బంగారు నంది అవార్డు


అవార్డు అందుకుంటున్న రుక్మిణి

కల్లూరు: కల్లూరుకు చెందిన హ్యూమన్ రైట్ కమిటీ జిల్లా అధ్యక్షురాలు ఎనుముల రుక్మిణికి బంగారు నంది అవార్డు లభించింది. ఈమేరకు ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ కమిటీ జాతీయ అధ్యక్షుడు బొడ్డపాటి దాసు, హైదరాబాద్ ఏసీపీ రామదాసు చేతుల మీదుగా ఆమె అవార్డు అందుకున్నారు. ఈసందర్భంగా రుక్మిణిని ఎనుముల రాము, వంశీ, వాకదాని రామకృష్ణ, పల్లా కృష్ణ, గంగుల వెంకటేశ్వర్లు, శీలం నరసింహారావు తదితరులు అభినందించారు.

రాష్ట్రస్థాయి ఈత పోటీలకు 17 మంది ఎంపిక


ఎంపిక పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

సింగరేణి(కొత్తగూడెం): సికింద్రాబాద్‌లో ఈనెల 29, 30వ తేదీల్లో జరగనున్న రాష్ట్ర స్థాయి ఈత పోటీల్లో పాల్గొనేందుకు భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల నుంచి క్రీడాకారులకు ఎంపిక చేశారు. ఇందుకోసం సోమవారం కొత్తగూడెంలోని సీఈఆర్ క్లబ్‌లో స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి జి.హన్మంతరావు రాజు ఆధ్వర్యాన పోటీలు నిర్వహించారు. అనంతరం ఉమ్మడి జిల్లా నుంచి 17 మందిని క్రీడాకారులను ఎంపిక చేశామని తెలిపారు. అసోసియేషన్ బాధ్యులు ఎం.ఎల్.నరసింహం, ఎంసీ పాసినెట్, ఆర్.నరహరి, సామ్యేల్, సుమంత్, డి.రాజు తదితరులు పాల్గొన్నారు.

రెండు నెలల మాసం.. శ్రావణం!

- నేటి నుంచి అధిక శ్రావణ మాసం
- ఈ నెలంతా శుభకార్యాలకు విరామం
- ఆగస్టు 17 నుంచి మొదలయ్యే నిజ శ్రావణంలోనే మళ్లీ కార్యాలు



ఖమ్మంగాంధీచౌక్ : ఈ ఏడాది శ్రావణ మాసానికి ఓ ప్రత్యేకత ఉంది. ఏటా నెల పాటు మాత్రమే ఉండే శ్రావణమాసం ఈ ఏడాది రెండు నెలల పాటు ఉండనుంది. ఇందులో ఓ మాసం అశుభకరం.. మరొకటి శుభకరమని పండితులు చెబుతున్నారు. శ్రావణమాసం అనగానే హిందువులు శుభకార్యాలను నిర్వహించుకునే నెలగా భావిస్తారు. అయితే నేటి(మంగళవారం) నుంచి శ్రావణం మొదలవుతున్నా దీనిని అధిక శ్రావణమాసంగా పిలవనుండడంతో శుభకార్యాలు నిర్వహించడానికి వీలుండదు. ఇక ఆగస్టు 17 నుంచి వచ్చే రెండో(నిజ) శ్రావణమాసంలో మాత్రం శుభ కార్యాలు నిర్వహించుకునేందుకు అవకాశం ఉంది.

మూడేళ్లకోసారి ఒక నెల అధికం

ప్రతీ మూడేళ్లకోసారి ఒక నెల అధికంగా వస్తుంది. ఈ సంవత్సరం తెలుగు క్యాలెండర్‌లో 13 నెలలు ఉండగా.. దీనిలో శ్రావణ మాసం రెండుసార్లు వచ్చింది. అంటే అధిక మాసం రావడంతో మొదటి నెలకు అధిక శ్రావణంగా, రెండో మాసాన్ని నిజ శ్రావణమాసంగా పిలుస్తారు. సూర్య, చంద్రుల కాలగణన ఆధారంగా ప్రతీ మూడేళ్లకోసారి వచ్చే అధిక మాసం ఈ ఏడాది శ్రావణ మాసంలో.. 19 ఏళ్ల తర్వాత వచ్చిందని, మళ్లీ 2042లో వస్తుందని పండితులు స్పష్టం చేస్తున్నారు. అధిక మాసాన్ని పురుషోత్తమ మాసంగా పిలవనుండగా.. మత విశ్వాసాల ప్రకారం ఎలాంటి శుభ కార్యాలు నిర్వహించరు.

నేటి నుంచి అధిక శ్రావణమాసం

ఆషాఢ మాసం సోమవారంతో పూర్తి కాగా, మంగళవారం నుంచి శ్రావణ మాసం ఆరంభమవుతోంది. ఆగస్టు 16 వరకు అధిక శ్రావణ మాసంగా ఉండనుండగా.. ఈ నెలలో ఎలాంటి శుభకార్యాలు తలపెట్టరాదని పండితులు సూచిస్తున్నారు. అలాగే, ప్రత్యేక పూజలు చేయకపోవటం మంచిదని చెబుతున్నారు. ఈ మాసం శ్రీమహా విష్ణువుకు ప్రీతికరమైనది కాగా పురుషోత్తమ మాసంగా పేరు ప్రసాదించారు. ఈ మాసంలో చేపట్టే దైవ కార్యాలు ఫలాలను ఇస్తాయని పురాణాలు చెబుతున్నాయి. ఈ మాసంలో విష్ణుసహస్రనామాలు పఠించటం, పితృ ఆరాధన, దాన ధర్మాలు వంటివి చేయటం మంచిదని వెల్లడించిన పండితులు.. వివాహాలు చేయడం, నూతన వ్యాపారాలు ఆరంభించడం, ఆస్తి కొనుగోళ్లు, ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన, ఉపనయనం వంటి కార్యక్రమాలు చేపట్టొద్దని సూచిస్తున్నారు.

నెల ఆగితేనే 'నిజ శ్రావణం'

అధిక శ్రావణ మాసం ఆగస్టు 16తో ముగిశాక 17 నుంచి నిజ శ్రావణ మాసం ప్రారంభమవుతుంది. ఈ నెలంతా ఏటా శ్రావణంలో జరుపుకున్నట్లుగా ప్రత్యేక పూజలు, శుభ కార్యాలు జరుపుకోవచ్చని అర్చకులు తెలిపారు. సెప్టెంబర్ 15 వరకు కొనసాగే నిజ శ్రావణంలో పండుగలు, శుభ కార్యాలే కాక శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీ వ్రతాలు జరుపుకోవడం, వివాహాలు, గృహ ప్రవేశాలు, నూతన వ్యాపారాల ఆరంభం, నూతన గృహాల శంకుస్థాపనలు వంటివి నిర్వహించవచ్చని పండితులు పేర్కొంటున్నారు.

శుభకార్యాలకు తావులేదు..



అధిక శ్రావణంలో శుభకార్యాలకు తావులేదు. నూతన గృహ ప్రవేశాలు, శంకుస్థాపనల వంటి శుభ కార్యక్రమాలు చేపట్టవద్దు. పితృకార్యాలు చేసేవారు అధిక మాసంతో పాటు నిజమాసంలో రెండు సార్లు చేయాలి. అలాగే, దైవ కార్యాలకు ఎలాంటి నియమం లేదు. నూతనంగా వివాహమైన వధువు నిజ శ్రావణంలో మాత్రమే అత్తవారింటికి వెళ్లాలి. – దాములూరి కృష్ణశర్మ, అర్చకులు, శ్రీ గుంటు మల్లేశ్వర స్వామి ఆలయం, ఖమ్మం

ఆగస్టు వరకు ముహూర్తాలు లేవు...



అధిక శ్రావణ మాసం కారణంగా ఆగస్టు నెల వరకు వివాహాలకు ముహూర్తాలు లేవు. ఇతర శుభకార్యాలు చేయడం కూడా మంచిది కాదు. ఆగస్టు 17 నుంచి నిజ శ్రావణ మాసం ప్రారంభం అవుతుంది. అప్పుడే మంచి ముహూర్తాలు ఉన్నాయి. ఏదైనా శుభకార్యాలు చేయాలనుకునే వారు పురోహితులను సంప్రదించి సరైన తేదీ ఎంచుకుంటే మంచిది. – విశ్వనాథశర్మ, ఉద్యోగ అర్చక సంఘం జిల్లా అధ్యక్షుడు, భద్రాచలం

భావి శాస్త్రవేత్తల్లారా రండి..

ఉన్నతస్థాయికి ఎదిగేలా ఇన్‌స్పైర్ మనాక్

- వచ్చేనెల 31వ తేదీ వరకు దరఖాస్తుల ఆహ్వానం
- ప్రతీ పాఠశాల నుంచి ఐదుగురికి అవకాశం
- జాతీయ స్థాయికి ఎంపికైతే రాష్ట్రపతిని కలిసే చాన్స్


గత ఏడాది జిల్లా స్థాయిలో ఎంపికైన ప్రాజెక్టుతో విద్యార్థి

ఖమ్మం సహకారనగర్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు మనాక్ ఇన్‌స్పైర్ దోహదపడుతోంది. నూతన ఆవిష్కరణలకు వేదికగా నిలుస్తూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను ఆవిష్కరింపచేసేందుకు గాను అమలుచేస్తున్న ఈ కార్యక్రమం ద్వారా ప్రస్తుత విద్యా సంవత్సరానికి దరఖకాస్తులు ఆహ్వానించారు. ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు అర్హులు కాగా, జిల్లా ఎక్కువ మంది దరఖాస్తు చేసుకునేలా ఉపాధ్యాయులు అవగాహన కల్పిస్తున్నారు.

ఆవిష్కరణలకు ప్రోత్సాహం

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, ప్రయోగాలు, ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు కేంద్రప్రభుత్వం డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ద్వారా 2009వ సంవత్సరం నుంచి ఇన్‌స్పైర్ మనాక్ నిర్వహిస్తోంది. ఈ పోటీల్లో జిల్లా నుంచి హాజరైన పలువురు విద్యార్థులు, రాష్ట్ర, జాతీయ స్థాయిలో సత్తా చాటారు. ఈమేరకు ప్రస్తుత విద్యాసంవత్సరం నూతన ప్రదర్శనలతో దరఖాస్తు చేసకునేందుకు వచ్చే నెల 31వ తేదీ వరకు అవకాశముంది.

యాప్ ద్వారా నమోదు

గతంలో ప్రాజెక్టులను వెబ్‌సైట్ ద్వారా మాత్రమే నమోదు చేసుకోవాల్సి ఉండేది. కానీ ఈ ఏడాది నుంచి మొబైల్ యాప్ నుంచి సైతం విద్యార్థులు ప్రాజెక్టుల నమోదుకు అవకాశం కల్పించారు. తద్వారా ఎక్కువ దరఖాస్తులు వస్తాయని భావిస్తున్నారు. అన్ని యజమాన్యాలకు చెందిన పాఠశాలల్లో 6నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు కాగా, ప్రతీ పాఠశాల ఐదుగురు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రదర్శనలను నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్(ఎన్ఐఎఫ్) పరిశీలించి ఎంపిక చేస్తుంది. ఆయా విద్యార్థుల బ్యాంక్ అకౌంట్‌లో రూ.10వేలు జమ చేసి ఆవిష్కరణలను మరింత మెరుగపర్చేలా సహకరిస్తారు. ఇందులో రూ.5వేలు ప్రాజెక్ట్ రూపకల్ప నకు, మిగతా నగదు రవాణా, తదితర ఖర్చులకు వినియోగించాల్సి ఉంటుంది.

జాతీయ స్థాయికి 60 మంది

జిల్లా స్థాయిలో సత్తా చాటిన ప్రదర్శనలకు నగదు ప్రోత్సాహకం అందజేసి మరింతగా తీర్చిదిద్దేలా చూస్తారు. ఆపై రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చిన వారిని జాతీయ స్థాయికి ఎంపిక చేసి.. మొత్తంగా 60 ప్రదర్శనలను రాష్ట్రపతి భవన్‌లో ప్రదర్శించే అవకాశం కల్పిస్తారు. గతేడాది జిల్లా నుంచి దరఖాస్తు చేసుకున్న వాటిలో 78 ప్రదర్శనలు మంజూరు కాగా.. అందులో 76 ప్రదర్శనలకు విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో ఏడు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థుల్లో తమలో నైపుణ్యాలను చాటుకునేందుకు మానక్ ఇన్‌స్పైర్‌ను సద్వినియోగం చేసుకోవాలి. ప్రతీ పాఠశాల నుంచి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడంతో పాటు మంచి ఆలోచనలతో ప్రాజెక్టులు రూపొందించాలి. ఈ విషయంలో ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉపాధ్యాయులు చొరవ తీసుకుని జిల్లా నుంచి అత్యధికంగా ప్రాజెక్టులు వచ్చేలా చూడాలి. – బి.సైదులు, జిల్లా సైన్స్ ఆఫీసర్, ఖమ్మం

జ్యూయెలరీ దుకాణంలో చోరీ

మూడు కేజీల వెండి వస్తువులు అపహరణ


షాపులోకి చొరబడేందుకు గోడకు చేసిన రంధ్రం


షాపులో సీసీ టీవీ పుటేజీ పరిశీలిస్తున్న ఏసీపీ రహమాన్

కొణిజర్ల: జ్యూయెలరీ దుకాణం గోడకు రంధ్రం చేసిన వ్యక్తులు షాపులో చొరబడి మూడు కేజీల వెండి వస్తువులు ఎత్తుకెళ్లారు. కొణిజర్ల ఎస్ఐ జె.శంకరరావు తెలిపిన వివరాల ప్రకారం.. కొణిజర్ల సెంటర్‌లో ఉన్న సూర్య జ్యూయెలరీ షాపు తెరవడానికి యజమాని మడక సురేష్ సోమవారం ఉదయం రాగా, వస్తువులన్నీ చిందర వందరగా కనిపించాయి. దీంతో పరిశీలించగా పక్కనే ఉన్న బ్యాంకు సర్వీస్ ప్రొవైడింగ్ సెంటర్ వెనక తలుపులు పగలగొట్టి, అందులో గోడకు రంధ్రం వేసి చొరబడినట్లు గుర్తించారు. దీంతో రూ.2.20లక్షల విలువైన సుమారు మూడు కేజీల వెండి వస్తువులు ఎత్తుకెళ్లగా ఆయన పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈమేరకు వైరా ఏసీపీ రెహమాన్ చేరుకుని సీసీ టీవీ పుటేజీలు పరిశీలించారు. నిందితులు ఆదివారం మధ్యాహ్నం షాపు వెనక భాగంలో రెక్కీ నిర్వహించినట్లు గుర్తించగా, క్లూస్ టీమ్ సీఐ నరేష్ నేతృత్వంలో వేలిముద్రలు సేకరించి దర్యాప్తు చేపట్టారు.

యువకుల గొడవలతో ప్రజల బెంబేలు

ఖమ్మంఅర్బన్: గంజాయి, ఇతరత్రా మత్తులో మునిగి తేలుతున్న పలువురు యువకులు పరస్పరం దాడులకు పాల్పడుతున్నారు. రాత్రీపగలు తేడా లేకుండా జరుగుతున్న ఈ గొడవలతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. నగరంలోని గోపాలపురం వద్ద ఒక మహిళను తీవ్రంగా కొడుతుండడంతో అడ్డుకున్న వ్యక్తిపై ఆదివారం సాయంత్రం దాడి చేసిన విషయం విదితమే. ఇక మండల కేంద్రమైన రఘునాథపాలెంలో కూడా ఇలాంటి ఘటన వెలుగు చూసింది. ఓ వైన్స్ వద్ద విచక్షణారహితంగా యువత దాడులకు దిగారు. ఈ ఘటనపై కొందరు తీసిన వీడియో సోమవారం వైరల్‌గా మారింది. కాగా, ఈ రెండు ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేయగా, ఇలాంటివి పునరావృతం కాకుండా పోలీసులు పెట్రోలింగ్ పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

రైతులకు నష్టం కలిగించేలా కేంద్రం తీరు

కూసుమంచి: దేశంలోని మోడీ ప్రభుత్వం వ్యవసాయ రంగంలో నల్లచట్టాలు తీసుకొచ్చి రైతులకు నష్టం కలిగేలా వ్యవహరిస్తోందని మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంద్యాల నర్సింహారెడ్డి ఆరోపించారు. మండలంలోని మల్లేపల్లిలో రెండు రోజుల పాటు జరగనున్న రైతు సంఘం రాజకీయ శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు నర్సింహారెడ్డి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ప్రజల కష్టాన్ని కార్పొరేట్లకు దోచిపెట్టడమే కాక, వ్యవసాయ రంగాన్ని తీవ్ర సంక్షభంలోకి నెట్టివేసిందని ఆరోపించారు. గత ఎన్నికల సందర్భంగా బీజేపీ నేతలు ఇచ్చిన ఏ హామీని అమలచేయలేదని తెలిపారు. ఈమేరకు రైతులు సంఘటితమై వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం రాష్ట్ర నాయకుడు నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ గాలి, నీరు, బొగ్గు తదితర సహజ వనరులను సైతం మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతోందని ఆరోపించారు. సంఘం మండల కార్యదర్శి బిక్కసాని గంగాధర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాదినేని రమేష్, బొంతు రాంబాబు, నాయకులు రంగారావు, బండి రమేష్, గుడవర్తి నాగేశ్వరరావు, ఎడవెల్లి రమణారెడ్డి, తోటకూరి రాజు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దాడులు జరిగినా పట్టించుకోరా?

- పీఎస్ ఎదుట ధర్నాకు సిద్ధమైన కాంగ్రెస్ శ్రేణులు
- చర్చలకు పిలిచి వివరాలు ఆరా తీసిన పోలీసులు


కూసుమంచి సీఐతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

తిరుమలాయపాలెం: మండలంలోని జల్లెపల్లిలో కాంగ్రెస్ కార్యకర్తలపై బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, కార్యకర్తలు దాడులకు పాల్పడినా పోలీసులు పట్టించుకోకపోవడం గర్హనీయమని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఈమేరకు డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ఆధ్వర్యానసోమవారం తిరుమలాయపాలెం పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా దుర్గాప్రసాద్, టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు తదితరులు తిరుమలాయపాలెం చేరుకోగా, కూసుమంచి సీఐ జితేందర్‌రెడ్డి, ఎస్ఐ వరాల శ్రీనివాస్ వారిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి చర్చించారు. అనంతరం ఖమ్మం రూరల్ ఏసీపీతో ఫోన్‌లో మాట్లాడి ఘటనపై విచారణ చేసి కేసు నమోదు చేస్తామనే హామీతో ధర్నా ఆలోచన విరమించుకున్నామని దుర్గాప్రసాద్ తెలిపారు. కాగా, ఇటీవల బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, ఆయన అనుచరులు కాంగ్రెస్ కార్యకర్తలపై దాడి చేసినా పోలీసులు కేసు నమోదు చేయలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకుల కనుసన్నలలో పోలీస్ వ్యవస్థ నడుస్తోందని మండిపడ్డారు. నాయకులు మద్ది శ్రీనివాసరెడ్డి, శేఖర్‌గౌడ్, బొందయ్య సంకీర్త్‌రెడ్డి, ఉన్నం రాజశేఖర్, సాగర్‌రెడ్డి, సత్యనారాయణ, శ్రీనివాస్, గోళ్ల లింగయ్య, పాప్యా నాయక్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

11 మందిపై కేసు నమోదు

మండలంలోని జల్లెపల్లిలో ఇటీవల కాంగ్రెస్ కార్యకర్తలపై దాడి చేసిన ఘటనలో 11మందిపై కేస నమోదు చేసినట్లు సోమవారం పోలీసులు తెలిపారు. ఈనెల 2న గుర్రాల రమేష్, పందిరి రమేష్ కాంగ్రెస్ సభకు జనాన్ని తీసుకవెళ్లారనే కోపంతో బీఆర్ఎస్ కార్యకర్తలు వారిపై దాడి చేశారు. ఘటనపై అందిన ఫిర్యాదుతో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భాషబోయిన వీరన్న సహా 11మంది పోలీసులు కేసు నమోదు చేశారు.

గురుకుల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న దుర్గాభవాని

ఖమ్మం సహకారనగర్: గురుకులాల ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చావా దుర్గాభవాని డిమాండ్ చేశారు. ఖమ్మం ధర్నాచౌక్‌లో గురుకుల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గురుకుల పాఠశాలలన్నింటికీ ఒకే విధమైన సమయం, బోధన పద్ధతులు అమలుచేయాలని, పదోన్నతులు, బదిలీలు తక్షణమే నిర్వహించాలన్నారు. అలాగే, పార్ట్ టైం ఉపాధ్యాయులకు మినిమం పేస్కేల్ ఇవ్వటంతో పాటు హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని, అన్ని హాస్టళ్లలో కేర్ టేకర్లను నియమించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వచ్చే నెల 5న హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహిస్తామని దుర్గాభవాని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీ.వీ.నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరావుతోపాటు లివింగ్‌స్టన్, మహేష్, దామోదర్, స్వర్ణలత, సురేష్, జితేష్, నాగేశ్వరరావు, వలీ, రాందాస్, ఉద్దండు తదితరులు పాల్గొన్నారు.

గాంధీపురం రైల్వేగేట్ వద్ద మరమ్మతులు


రైల్వే గేట్ వద్ద చేపడుతున్న మరమ్మతులు

కారేపల్లి: మండలంలోని గాంధీపురం రైల్వే గేట్ వద్ద సోమవారం నుంచి రోడ్డు మరమ్మతు పనులు మొదలయ్యాయి. దీంతో ఖమ్మం నుంచి ఇల్లెందు వైపు, ఇల్లెందు నుంచి ఖమ్మం వైపు వెళ్లే వాహనాలను అధికారులు కారేపల్లి మీదుగా దారి మళ్లించారు. ఈనెల 20వ తేదీ వరకు మరమ్మతులు కొనసాగనున్నందున వాహనదారులు గమనించాలని కోరారు. కాగా, వాహనాలు కారేపల్లి మీదుగా వచ్చి వెళ్తుండడంతో రద్దీగా మారింది.

20 క్వింటాళ్ల రేషన్‌బియ్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న బియ్యం, వ్యాన్‌తో ఎస్సై రవి, సిబ్బంది

ఏన్కూరు: అక్రమంగా తరలిస్తున్న 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టగా కేసుపల్లి నుండి ఏపీకి వ్యాన్‌లో తరలిస్తున్న బియ్యం పట్టుబడ్డాయి. దీంతో వ్యాన్‌తో పాటుగా బియ్యాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి పగడాల నరేష్, భూక్యా వీరభద్రరావును అదుపులోకి తీసుకున్నారు. తనిఖీల్లో ఎస్ఐ బాదావత్ రవి, సిబ్బంది కొండయ్య, శ్రీను, రవి, నరేష్ పాల్గొన్నారు.

రెండురోజుల వ్యవధిలో భార్యాభర్తలు మృతి


కూనయ్య


చిట్టెమ్మ

సత్తుపల్లిరూరల్: భర్త మరణించిన రెండు రోజులకే భార్య మృతి చెందిన ఘటన సత్తుపల్లి మండలం సిద్ధారంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు గోళ్లమూడి కూనయ్య(79) అనారోగ్యంతో బాధపడుతూ ఈనెల 14వ తేదీన మృతి చెందాడు. అప్పటి నుంచి మనోవేదనకు గురైన ఆయన భార్య చిట్టెమ్మ(74) కూడా ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందింది. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. రెండు రోజుల వ్యవధిలోనే భార్యాభర్తలు మృతి చెందటంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

చికిత్స పొందుతున్న వ్యక్తి..

కల్లూరు: కల్లూరు రామానగర్‌లో పురుగుల మందు తాగిన రైతు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. రామానగర్ కాలనీకి చెందిన రైతు కుంచాల దుర్గయ్య(49) ఎకరం పొలం అమ్మి డబ్బుచెల్లించినా అప్పులు తీరలేదు. దీంతో మిగిలిన అర ఎకరం అమ్మేందుకు యత్నించగా కుటుంబీకులు అభ్యంతరం తెలిపారు. ఈమేరకు మనస్థాపానికి గురైన దుర్గారావు ఈనెల 7న పురుగుల మందు తాగగా కల్లూరులోని ఆస్పత్రిలో చికిత్స చేయించాక ఖమ్మం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన సోమవారం మృతి చెందాడు. దుర్గయ్యకు తల్లి గోవిందమ్మ, భార్య వరలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉండగా, కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా, ఆయన కుటుంబసభ్యులను ఎమ్మెల్యే వెంకటవీరయ్య తదితరులు పరామర్శించారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి...

మధిర: ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడిన ఒక వ్యక్తి మృతి చెందాడు. యశ్వంత్‌పూర్ నుంచి టాటానగర్ వెళ్తున్న ఎక్స్‌ప్రెస్‌లో రైలులో ప్రయాణిస్తున్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం పర్శబహార్ జిల్లా సగ్జార్ ప్రాంతానికి చెందిన నీరజ్ మింజ్(19) సోమవారం ఉదయం ప్రమాదవశాత్తు జారి పడడంతో అక్కడకక్కడే మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఖమ్మం జీఆర్పీ ఎస్ఐ పి.భాస్కర్‌రావు, హెడ్ కానిస్టేబుల్ ఎస్.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. కాగా, నీరజ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అన్నం ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీనివాసరావు సహకారంతో ఖమ్మం తరలించారు.

కాలేజీల్లో పెరిగిన కటాఫ్

- కొత్తగా అందుబాటులో 14,565 కంప్యూటర్ కోర్సు సీట్లు
- కోరుకున్న కాలేజీలో సీఎస్ఈ సీటు దక్కించుకున్న విద్యార్థులు
- రెండో విడత కౌన్సెలింగ్‌లో జాగ్రత్తగా ఆప్షన్లు ఇస్తే కోరుకున్న సీటు!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్లు పెరగడం ఈసారి విద్యార్థులకు కలిసి వచ్చింది. అన్ని కాలేజీల్లోనూ కటాఫ్ పెరిగింది. చాలామంది కోరుకున్న కాలేజీల్లో కంప్యూటర్ సైన్స్ సీటు దక్కించుకోగలిగారు. మొత్తం భర్తీ అయిన సీట్లలో 62.5% కంప్యూటర్ కోర్సులవే ఉన్నాయి. గత ఏడాది (2022) తొలి విడత కౌన్సెలింగ్‌లో జేఎన్‌టీయూహెచ్ (సీఎస్ఈ)లో బాలికలకు 422 ర్యాంకు వరకే సీటు వచ్చింది. ఈసారి బాలురకు 813వ ర్యాంకు వరకూ, బాలికలకైతే 962 ర్యాంకు వరకూ ఓపెన్ కేటగిరీలో సీటు వచ్చింది. పేరున్న ప్రైవేటు కాలేజీల్లో గత సంవత్సరం గరిష్టంగా 3 వేల లోపు ర్యాంకు వరకే సీటు వస్తే, ఈసారి ర్యాంకు 4 వేలు దాటినా సీట్లు వచ్చాయి. కొత్తగా కంప్యూటర్ కోర్సులు అందుబాటులోకి రావడంతో ఈ ఏడాది అదనంగా 7,635 సీట్లు మంజూరయ్యాయి. కొన్నేళ్లుగా డిమాండ్ లేని సివిల్, మెకానికల్, ఈఈఈ బ్రాంచీల్లో 6,930 సీట్లను కాలేజీలు రద్దు చేసుకున్నాయి. వీటి స్థానంలో విద్యార్థుల నుంచి డిమాండ్ ఉన్న కంప్యూటర్ కోర్సు సీట్లు పెంచుకున్నాయి. ఫలితంగా ఈ ఏడాది మొత్తం 14,565 కంప్యూటర్ కోర్సు సీట్లు కొత్తగా అందుబాటులోకి వచ్చినట్టయ్యింది. కాగా ఇందులో 10 వేలకు పైగా కన్వీనర్ కోటాలో ఉన్నాయి.

రెండో దశలోనూ మంచి చాన్స్!

తొలిదశ కౌన్సెలింగ్‌ను పరిశీలించిన విద్యార్థులు రెండో దశపై ఆశలు పెంచుకుంటున్నారు. ఈ దశలో కూడా కటాఫ్ మరింత పెరిగే వీలుందని భావిస్తున్నారు. ఈ ఏడాది 1,56,879 మంది ఎంసెట్ అర్హత సాధించారు. వీరిలో 76,821 మంది తొలి విడత కౌన్సెలింగ్‌కు దరఖాస్తు చేసుకున్నా 75,708 మంది మాత్రమే ఆప్షన్లు ఇచ్చారు. వీరిలో 70,665 మందికి సీట్ల కేటాయింపు జరిగింది. నిజానికి ఇందులో వెయ్యి లోపు ర్యాంకర్లు జేఈఈలోనూ ర్యాంకులు పొంది ఉండే వీలుంది. జోసా ఆరవ రౌండ్ కౌన్సెలింగ్ త్వరలో చేపట్టే వీలుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎంసెట్‌లో సీటు వచ్చిన వాళ్లు ఎన్‌ఐటీల్లో సీట్లు వస్తే వాటిల్లో చేరే వీలుంది. కొంతమంది ఇతర రాష్ట్రాల్లో ఇంజనీరింగ్ కాలేజీలకు వెళ్తారు. మరికొంత మంది డీమ్డ్ యూనివర్సిటీల్లో చేరతారు. మొత్తం మీద ఎంసెట్ తొలి రౌండ్‌లో సీట్లు వచ్చిన వారిలో 5 వేల మంది వరకూ రాష్ట్ర ఇంజనీరింగ్ కాలేజీల్లో చేరే అవకాశం లేదని అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో రెండో రౌండ్‌లో జాగ్రత్తగా ఆప్షన్లు ఇస్తే కోరుకున్న బ్రాంచీలో, కాలేజీలో సీటు వచ్చే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

జాగ్రత్తగా పరిశీలించి ఆప్షన్ ఇవ్వాలి

రెండో దశ ఎంసెట్ కౌన్సెలింగ్‌లో జాగ్రత్తగా వ్యవహరించాలి. విద్యార్థి తనకు వచ్చిన ర్యాంకును దృష్టిలో పెట్టుకుని ఆప్షన్లలో ప్రాధాన్యత నిర్ణయించుకోవాలి. దీనికన్నా ముందు.. తాను కోరుకునే కాలేజీలో తొలిదశలో ఏయే ర్యాంకులకు సీట్లు వచ్చాయి? నిట్ వంటి జాతీయ కాలేజీలకు ఏయే ర్యాంకర్ల వరకూ వెళ్లే చాన్స్ ఉంది? అనే దానిపై కొంత కసరత్తు చేయాలి. గుడ్డిగా ఆప్షన్లు ఇవ్వకుండా, అన్నీ పరిశీలించి ఇస్తే కోరుకున్న బ్రాంచీ, కాలేజీ దక్కడం ఖాయం.

– ఎంఎస్ రావు (గణిత శాస్త్ర అధ్యాపకుడు)

తొలి దశ కౌన్సెలింగ్‌లో ప్రధాన కాలేజీల్లో ఈ ఏడాది కటాఫ్ ర్యాంకులు ఈ విధంగా ఉన్నాయి...

యాజమాన్యం		ఓపెన్	బీసీ-ఏ	బీసీ-బీ	బీసీ-సీ	బీసీ-డీ	బీసీ-ఈ	ఎస్సీ	ఎస్టీ
ఓయూ-సీఎస్ఈ	బాలురు	1391	3918	1804	5687	1912	2788	6101	7349
	బాలికలు	1598	5524	2284	-------	2215	1900	7136	8414
సీఎస్ఈ (ఏఐ)	బాలురు	2848	6195	3798	19380	4842	4790	10923	11076
	బాలికలు	2877	4328	3901	-------	4724	5987	13355	13947
ఈసీఈ	బాలురు	3623	8934	6822	-------	6248	-------	14626	15567
	బాలికలు	4436	10084	6855	-------	6337	5447	15561	18188
జేఎన్‌టీయూ	బాలురు	813	1579	1245	-------	1199	1886	4013	4534
సీఎస్ఈ	బాలికలు	962	2290	1028	-------	1579	-------	6753	6196
సీఎస్ఈ-ఏఐ	బాలురు	1359	3501	2131	-------	2399	4692	8932	8547
	బాలికలు	1915	3975	2232	-------	2885	4478	9572	10293
సీబీఐటీ	బాలురు	1478	4509	2246	6314	2296	3014	861	11217
	బాలికలు	1903	5314	2198	-------	2695	3867	11527	12687
వాసవీ సీఎస్ఈ	బాలురు	2405	7050	3008	12034	3837	6072	12291	15812
	బాలికలు	2266	6968	3907	-------	3648	6916	14525	16040
వీఎన్ఆర్ విజ్ఞాన	బాలురు	1712	4952	2636	3099	2636	4773	11919	14598
జ్యోతి-సీఎస్ఈ	బాలికలు	1935	4309	2683	5242	2755	4924	11642	18027
కేఎంఐటీ-సీఎస్ఈ	బాలురు	5120	16102	7260	20337	7654	10730	32950	30728
	బాలికలు	5682	21945	8948	28661	9125	15978	33023	55150
గోకరాజు-సీఎస్ఈ	బాలురు	4014	11077	7228	25132	6399	9195	22605	26200
	బాలికలు	5015	14331	7789	23320	7589	11614	21286	27220
నారాయణమ్మ-సీఎస్ఈ	బాలికలు	4634	13033	7004	28674	7446	13239	25241	27323

రాష్ట్రంలో తగ్గిన పేదరికం

13.18 % నుంచి 5.88% తగ్గుదల

- 27.61 లక్షల మందికి పేదరికం నుంచి విముక్తి
- కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో అత్యధికంగా 16.59% పేదలు
- అత్యల్పంగా పెద్దపల్లి జిల్లాలో పేదరికంలో ఉన్నది 2.17% మందే
- నీతి ఆయోగ్ నివేదికలో వెల్లడి



సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో గత కొన్నేళ్లలో పేదరికం రికార్డు స్థాయిలో తగ్గిందని నీతి ఆయోగ్ వెల్లడించింది. 2015–16 నుంచి 2019–21 మధ్య దేశవ్యాప్తంగా 13.5 కోట్ల మంది బహుముఖీయ పేదరికం నుంచి బయటపడ్డట్లు తెలిపింది. దేశవ్యాప్తంగా పేదల సంఖ్య 24.85% నుంచి 14.96%కి తగ్గిందని పేర్కొంది. ఇదే కాలానికి తెలంగాణలో 27,61,201 మంది, ఏపీలో 30,19,718 మంది ప్రజలు బహుముఖీయ పేదరికం నుంచి బయటపడ్డట్లు వివరించింది. ఈ మేరకు 'నేషనల్ మల్టీ డైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్: ఎ ప్రోగ్రెస్ రివ్యూ 2023' పేరిట నీతి ఆయోగ్ సోమవారం ఢిల్లీలో నివేదిక విడుదల చేసింది. నీతిఆయోగ్ సభ్యులు డాక్టర్ వి.కె. పాల్, డాక్టర్ అరవింద్ వీరమణి, నీతి ఆయోగ్ సీఈఓ బి.వి.ఆర్ సుబ్రహ్మణ్యం సమక్షంలో ఆ సంస్థ వైస్ ఛైర్మన్ సుమన్ బేరీ నివేదికను విడుదల చేశారు.

గ్రామాల్లో ఎక్కువగా పేదరికం తగ్గుదల

ఈ నివేదిక ప్రకారం తెలంగాణలో 2015–16 నాటికి 13.18 శాతం మంది పేదలు ఉండగా 2019–21 నాటికి వారి సంఖ్య 5.88%కి తగ్గింది. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో 19.51% నుంచి 7.51% మంది, పట్టణ ప్రాంతాల్లో 4.92% నుంచి 2.73% మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారు. జాతీయ బహుముఖీయ పేదరిక సూచీ (ఎంపీఐ)లోని విద్య, ఆరోగ్యం, జీవన ప్రమాణాల వంటి 12 అంశాలను పరిగణనలోకి తీసుకోవడంతోపాటు 2019–21 జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్–5) ఆధారంగా నీతి ఆయోగ్ ఈ నివేదికను రూపొందించింది. తెలంగాణలో అత్యధికంగా కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 16.59%, అత్యల్పంగా పెద్దపల్లి జిల్లాలో 2.17% మంది పేదలు ఉన్నారు.

తెలంగాణలో ఎంపీఐ సూచికలు :

అంశం	2015-16	2019-21
1) పోషకాహారం లభించని వారు	31.09%	28.35%
2) కౌమార, పిల్లల మరణాలు	1.38%	1.15%
3) వైద్యం అందని బాలింతలు	10.87%	13.17%
4) పాఠశాలలకు వెళ్లని విద్యార్థులు	2.10%	1.35%
5) వంటచెరకు దొరకని వారు	31.67%	7.93%
6) మరుగుదొడ్లు లేని వారు	49.01%	24.41%
7) మంచినీరు లభ్యతలేని వారు	10.80%	3.36%
8) విద్యుత్ సదుపాయంలేని వారు	1.23%	0.44%
9) సొంత ఇల్లు లేని వారు	25.54%	20.49%
10) కనీస ఆస్తి లేని వారు	12.79%	8.51%
11) బ్యాంకు ఖాతా లేని వారు	7.46%	2.74%
12) పాఠశాల విద్య అందని వారు	15.83%	14.56%

తెలంగాణ జిల్లాల్లో పేదల జనాభా శాతం పరిస్థితి

జిల్లా	పేదల జనాభా శాతం (2019-21)	(2015-16)
ఆసిఫాబాద్	16.59%	-------
జోగులాంబ గద్వాల్	15.37%	-------
ఆదిలాబాద్	14.21%	27.12%
వికారాబాద్	12.50%	-------
కామారెడ్డి	11.90%	-------
మహబూబ్‌నగర్	10.27%	24.72%
మెదక్	9.34%	17.87%
వనపర్తి	8.86%	-------
నిర్మల్	7.14%	-------
సంగారెడ్డి	7.09%	-------
నిజామాబాద్	6.76%	21.06%
మహబూబాబాద్	6.45%	-------
వరంగల్ రూరల్	6.45%	-------
జయశంకర్ భూపాలపల్లి	6.33%	-------
నాగర్‌కర్నూల్	5.95%	-------
జగిత్యాల	4.77%	-------
మంచిర్యాల	4.43%	-------
నల్గొండ	4.40%	13.35%
భద్రాద్రి కొత్తగూడెం	4.33%	-------
యాదాద్రి భువనగిరి	4.24%	-------
సూర్యాపేట	3.89%	-------
రంగారెడ్డి	3.83%	5.31%
రాజన్న సిరిసిల్ల	3.68%	-------
సిద్దిపేట	3.39%	-------
ఖమ్మం	3.18%	13.75%
మేడ్చల్ మల్కాజ్‌గిరి	3.06%	-------
జనగాం	2.91%	-------
హైదరాబాద్	2.52%	4.21%
కరీంనగర్	2.50%	8.65%
వరంగల్ అర్బన్	2.41%	-------
పెద్దపల్లి	2.17%	-------
వరంగల్	-------	12.12%

జిల్లా వార్తలు

రామయ్యను దర్శించుకున్న నారాయణపేట ఎస్పీ



ఆలయంలో నారాయణపేట ఎస్పీ కుటుంబీకులు, ఈఓ రమాదేవి

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్రస్వామిని సోమవారం నారాయణపేట జిల్లా ఎస్పీ వెంకటేశ్వర్లు దర్శించుకున్నారు. ఇటీవల సివిల్స్‌లో మూడో ర్యాంకు సాధించిన ఆయన కుమార్తె ఉమాహారతి తదితరులతోపాటు ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే, ఉపాలయాల్లో దర్శనం అనంతరం పండితులు వేదాశీర్వచనం అందచేయగా ఈఓ రమాదేవి సన్మానించారు.

శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం

భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదానానికి హైదరాబాద్‌కు చెందిన భక్తులు సోమవారం విరాళం అందచేశారు. ఆర్‌కే.పురానికి చెందిన కొల్లూరి విశ్వభాను రూ.50 వేలు విరాళం అందచేయగా ఈఓ రమాదేవి వారికి రశీదు ఇచ్చి సన్మానించారు. దాత కుటుంబ సభ్యులతోపాటు ఏఈఓ భవానీరామకృష్ణ, ప్రధాన అర్చకుడు సీతారామానుజాచార్యులు, ఆలయ ఇన్‌స్పెక్టర్ ఎల్.సాయిబాబు పాల్గొన్నారు.

ఎన్నికల బరిలో ప్రజాపంథా

రాష్ట్రంలోని పలుచోట్ల పోటీ చేస్తాం

- బూర్జువా, పాలకవర్గాలతో పొత్తు ఉండదు
- ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు



మాట్లాడుతున్న ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి రంగారావు, పక్కన గుమ్మడి నర్సయ్య, నాయకులు

ఇల్లెందు: వచ్చే నవంబర్‌లో అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయని.. ఆ ఎన్నికలలో ప్రజాపంథా వివిధ నియోజకవర్గాల్లో పోటీ చేస్తుందని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు వెల్లడించారు. అయితే, బూర్జువా, భూస్వామ్య, పాలకవర్గాలు, వాటితో పొత్తు పెట్టుకునే పార్టీలతో తమకు పొత్తు ఉండదని స్పష్టం చేశారు. కేవలం విప్లవ సంస్థలతో కలిసి పోటీ చేస్తామని, అవసరమైతే అందరికీ ఆమోదయోగ్యమైన ఉమ్మడి అభ్యర్థిని పోటీలో నిలిపేందుకు సిద్ధమేనని తెలిపారు. ఇల్లెందులోని ఎల్లన్న విజ్ఞాన కేంద్రంలో రెండు రోజులుగా జరిగిన ప్రజాపంథా రాష్ట్ర కమిటీ సమావేశంలో పలు అంశాలపై చర్చించి పోరాట కార్యాచరణ రూపొందించారు. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటుచేసిన రాష్ట్ర కమిటీ నిర్ణయాలను రంగారావు వెల్లడించారు.

ప్రశ్నించే శక్తులపై ఉక్కుపాదం

దేశంలో బీజేపీ ఫాసిస్టు విధానాలు అవలంబిస్తోందని, ప్రశ్నించే వారిపై ఉపా తదితర చట్టాలను ప్రయోగిస్తోందని రంగారావు ఆరోపించారు. ఇక రాష్ట్రంలో కేసీఆర్ ప్రాంతీయ అస్తిత్వం, ఆత్మగౌరవం పేరుతో ప్రజలు వంచిస్తున్నారని మండిపడ్డారు. దొరల పాలనను తలపిస్తుండగా, సమస్యలను విన్నవించుకునే అవకాశం ప్రతిపక్షాలకు ఇవ్వడం లేదన్నారు. రాష్ట్రంలో 11 లక్షల మందికి పోడు పట్టాలు ఇస్తామని చెప్పి 4 లక్షల పట్టాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. పట్టాల పంపిణీలోనూ అవకతవకలు జరిగినందున, విచారణ జరిపి అర్హులైన గిరిజనులందరికీ పోడు పట్టాలు ఇవ్వాలని కోరారు. అలాగే, గ్రామపంచాయతీ, మధ్యాహ్న భోజనం వర్కర్ల సమ్మె పరిష్కారంపై దృష్టి సారించాలని సూచించారు. అఖిల భారత రైతు కూలీ సంఘం జాతీయ నాయకుడు రాయల చంద్రశేఖర్ మాట్లాడుతూ రైతాంగ సమస్యలు, వ్యవసాయ చట్టాలు రద్దు విషయమై ఈనెల 30న ఏపీలో, 31న తెలంగాణలో జాతీయ స్థాయి సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చాక కార్మికుల సమస్యల పరిష్కారంలో విఫలమయ్యారని ఆరోపించారు. ఈమేరకు ఆగస్టు 4న కార్మిక గర్జన పేరుతో రాష్ట్ర స్థాయి ఆందోళనలు చేపడుతున్నట్లు తెలిపారు. కాగా, 24 గంటల పాటు విద్యుత్ ఇస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలోచేర్చాలని సూచించారు. ఈ సమావేశంలో నాయకులు కిచ్చెల రంగయ్య, రాయల చంద్రశేఖర్, గుమ్మడి నర్సయ్య, చంద్ర అరుణ, ప్రభాకర్, వనమాల కృష్ణ, చిన్న చంద్రన్న తదితరులు పాల్గొన్నారు.

■ కార్మికుల ప్రాణాలంటే పట్టింపులేదా ?



భద్రాచలం వద్ద గోదావరి రెండో వంతెనపై ప్రమాదకర పరిస్థితుల్లో పని చేస్తున్న కార్మికులు




ప్రమాదకర పరిస్థితుల్లో పనులు

భద్రాచలం వద్ద గోదావరి నదిపై రెండో వంతెన నిర్మాణ పనులు దక్కించుకున్న సంస్థ నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. రెండేళ్ల కిందటే వంతెన పనులు పూర్తి చేయాల్సి ఉండగా నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి. వేగంగా పనులు చేపట్టలేని సంస్థ.. చివరకు అక్కడ పని చేస్తున్న కార్మికులకు సరైన భద్రత, రక్షణ ఏర్పాట్లు చేయడంలోనూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. రెండేళ్ల క్రితమే పిల్లర్ల నిర్మాణం పూర్తయింది. గత రెండేళ్లుగా గడ్డర్లు నిర్మిస్తూ ఇటీవలే ఆ పని కూడా పూర్తి చేసింది. ఇక రోడ్డు, నడక దారి, పిట్టగోడ నిర్మాణ పనులు సాగుతున్నాయి. నిత్యం పదుల సంఖ్యలో కార్మికులు ఇక్కడ పని చేస్తున్నారు. వంతెన చివరన నిలబడి, కూర్చుని వీరు చెమట ధార పోస్తున్నారు. ఇలాంటి పనులు చేసేప్పుడు కచ్చితంగా కార్మికులకు హెల్మెట్, నీ గార్డ్, రోప్ సపోర్ట్, బెల్ట్, షూ ఉండాలి. వీటిని పనులు చేపడుతున్న కాంట్రాక్టరే కార్మికులకు సమకూర్చాలి. ఈ రక్షణ పరికరాలతోనే సైట్ ఇంజనీర్లు పనులు నిర్వహించాలి. ఈ విషయంలో నిర్లక్ష్యంగా ఉంటే జాతీయ రహదారుల శాఖ, ఆర్అండ్‌బీ అధికారులు కొరడా ఝుళిపించాలి. కానీ ఇక్కడ పని చేస్తున్న వలస కార్మికుల ప్రాణాలంటే ఎవరికీ పట్టింపు లేకుండా పోయింది. నిత్యం గోదావరి వంతెన మీదుగా రాకపోకలు సాగిస్తున్న అధికారులు సైతం చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తున్నారు. కూలీల దీనావస్థ చూస్తున్న భక్తులు ఆ రామయ్యే వారిని కాపాడాలంటూ వేడుకుంటున్నారు.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తాం..





ఎంపీలు నాగేశ్వరరావు, వద్దిరాజుకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు, నాయకులు

రైల్వేలైన్ అలైన్‌మెంట్‌పై ఎంపీలు నామా, రవిచంద్ర

ఖమ్మం మయూరిసెంటర్/నేలకొండపల్లి: వ్యవసాయం అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్న సీఎం కేసీఆర్ నేతృత్వాన రైతులు ఇబ్బంది పడకుండా చూస్తామని ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర వెల్లడించారు. పాపటపల్లి–జాన్ పహాడ్ –మిర్యాలగూడ ప్రతిపాదిత రైల్వే లైన్ అలైన్‌మెంట్ మార్చాలని కోరుతూ ఖమ్మం రూరల్, ముదిగొండ, నేలకొండపల్లి మండలాల రైతులు సోమవారం ఎంపీలను హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సన్న, చిన్నకారు రైతులకు ఉన్న కొద్దిపాటి భూములు రైల్వే లైన్ కింద వెళ్తే జీవనోపాధి కరువవుతుందని తెలిపారు. దీంతో ఎంపీలు స్పందిస్తూ.. సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు కేంద్ర రైల్వే మంత్రితో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చంద్రావతి, నాయకులు, రైతు ప్రతినిధులు శాఖమూరి రమేష్, కట్టికోల నాగేశ్వరరావు, సాధిక్ అలీ, సుధాకర్, అనంతు నాగేందర్‌గౌడ్, నెల్లూరి భరత్, అనంతు భాగ్యమ్మ, పద్మ, కట్టికోల నర్సయ్య, వల్లూరి పట్టాభి, గుర్రం అచ్చయ్య, పుచ్చకాయల సుధాకర్, ఎడ్లపల్లి వెంకట్రామయ్య, కుర్రా వెంకన్న, తోకల ఉపేందర్, గిస్కా రామ్మూర్తి, రామగిరి వెంకన్న పాల్గొన్నారు.

65 లక్షల ఆయిల్‌పామ్ మొక్కలు సిద్ధం..

రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ ఛైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి



ఎమ్మెల్యే వెంకటవీరయ్యను సన్మానిస్తున్న ఆయిల్‌ఫెడ్ ఛైర్మన్ రామకృష్ణారెడ్డి, తదితరులు

సత్తుపల్లి: రాష్ట్రంలో ఎనిమిది జిల్లాల్లో ఆయిల్ పామ్ సాగుకు సిద్ధమైన రైతుల కోసం 22 నర్సరీల ద్వారా 65 లక్షల మొక్కలు పంపిణీ చేయనున్నామని రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ ఛైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి వెల్లడించారు. సత్తుపల్లిలోని డివిజన్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. ఆయిల్ పామ్ సాగు నానాటికీ విస్తరిస్తుండగా, సిద్దిపేట ఫ్యాక్టరీ పనులు మొదలయ్యాయని తెలిపారు. అలాగే, మహబూబాబాద్ జిల్లా తొర్రూరు, వేంసూరు మండలం కల్లూరుగూడెంలో కూడా త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. 2026 నాటికి ఈ మూడు ఫ్యాక్టరీల ద్వారా పామాయిల్ ఉత్పత్తి మొదలవుతుందని వివరించారు. సబ్సిడీ పోగా రూ.20 చొప్పున ఆయిల్ పామ్ మొక్కల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు 24 గంటల్లోనే పంపిణీ చేస్తున్నామన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఈ ఏడాది 8,900 ఎకరాల్లో సాగు లక్ష్యం కాగా ఇప్పటివరకు 1,140 ఎకరాల్లో మొక్కలు నాటారని, నెలాఖరులోగా లక్ష్యాన్ని అధిగమిస్తామని తెలిపారు.

ఎమ్మెల్యే సండ్రకు సన్మానం

తెలంగాణ రాష్ట్ర ఆయిల్‌ఫాం అడ్వైజరీ బోర్డు సభ్యుడిగా నియమితులైన ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యను క్యాంప్ కార్యాలయంలో ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ డివిజనల్ మేనేజర్ బాలకృష్ణ, ఫీల్డ్ ఆఫీసర్ కృష్ణారావు, మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్‌తో పాటు శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, కొత్తూరు ఉమామహేశ్వరరావు, అద్దంకి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

దత్తత గ్రామాలపై ప్రత్యేక దృష్టి

రాష్ట్ర గవర్నర్ తమిళిసై



నిధుల మంజూరు పత్రాన్ని అందజేస్తున్న గవర్నర్

అశ్వారావుపేటరూరల్: కొండరెడ్లు అభివృద్ధి సాధించేలా దత్తత గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చెప్పారని మండలంలోని గోగులపూడి గ్రామస్తులు తెలిపారు. నాబార్డు 42వ వ్యవస్థాపక దినోత్సవాన్ని హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించగా ముఖ్యఅతిథిగా గవర్నర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా అశ్వారావుపేట మండలం గోగులపూడి వాసులు గోగుల సీత, చెల్లమ్మ, నాబార్డు డీడీఎం సుజిత్‌కుమార్, వాసన్ సంస్థ ప్రతినిధి సతీష్ కుమార్‌కు కొండ రెడ్ల గ్రామాల అభివృద్ధికి రూ. 9 లక్షల నిధుల కేటాయింపుపై మంజూరు పత్రాన్ని అందజేశారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ తన దత్తత గ్రామాలైన అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లోని గోగులపూడి, పూచికుంటను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు నాబార్డు ముందుకు రావడం హర్షణీయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్లు అమిత్ జింగ్రా, ఉష తదితరులు పాల్గొన్నారు.